# జీవితం - సినిమా - నటన

సినిమా బాగుందన్న టాక్ రావటంతో వచ్చి రెండు నెలలైనా జనం బాగా వున్నారు. ముందే రావడం మంచిదయింది. రెండు టికెట్లని అడ్వాన్స్ బుకింగ్‌లో తీసుకున్నాం.

''ఇంకా చాలా టైముందిగా....అలావెళ్ళి కామత్‌లో ఓ కాఫీ తాగొద్దామా?'' శ్రీవారు ఆ మాట అనడమే ఆలస్యం తలూపాను.

ఇద్దరం హోటల్‌కేసి దారితీశాం.

''సార్!..'' హోటల్లోకి అడుగు పెట్టబోతున్న వాళ్ళమల్లా ఒక్క క్షణం ఆగాం.

దీనంగా మా వంకే చూస్తున్న ఆయనకి అరవై సంవత్సరాలపైనే వుంటుంది వయసు. చిరిగిన దుస్తులు, మొహంలో దైన్యం. బ్రతికిచెడ్డ వాడిలా అనిపించి జాలేసింది.

''నువ్వా? ...నీ నటన నాకు తెలుసులే!'' నిర్లక్ష్యంగా ఆయనవంక ఓ చూపు విసిరి ముందుకు కదిలారాయన.

"సార్!....పెద్దవాణ్ణి.... రెండ్రోజులైంది భోంచేసి....కాళ్ళు వణుకుతున్నాయి....'' ఆయన మాట కూడా వణికింది.

ఆయనమీద జాలి, మావారిమీద కోపం వచ్చింది.

''ఇప్పుడు మనం కాఫీ తాగకపోతేనేం? ఆ పైసలు ఆ ముసలాయనకిస్తే ప్రాణాన్ని నిలబెట్టుకుంటాడు'' మావారి చెయ్యి పట్టుకుని లాగుతూ అన్నాను.

''అతన్ని గురించి చెబుతా, లోపలికిరా....''

బాధనిపించినా సాయం చేయలేని నా పరిస్థితికి నా మీద నాకే కోపం వచ్చింది. మౌనంగా ఆయన్ననుసరించాను.

కాఫీ తాగుతుంటే ఆయన మొదలుపెట్టారు.......

"మూడు నాల్గు నెలల క్రితం నేను, రాజారావు ఓసారి ఈ హాల్‌కే సినిమాకి వచ్చాం. అప్పుడూ ఇలాగే టైముండడంతో కాఫీ తాగడానికి ఇక్కడికే వచ్చాం. అప్పుడూ ఈ ముసలాయన ఇలాగే దర్శనమిచ్చాడు. జాలేసింది. అతనికి అర్ధరూపాయి ఇచ్చినా సినిమా చూడకుండా వెనక్కి తిరగాల్సిన ఆర్థిక పరిస్థితి అప్పుడు మాది! అయినా ఆయనకి ఏదైనా టిఫిన్ తినమని ఓ రూపాయి ఇచ్చి, మేం కాఫీ తాగి సినిమా చూడకుండా వెనుదిరిగాం....''

''ఇప్పుడూ అలాగే చేద్దాం....''

"నేను చెప్పేది పూర్తిగా విను. మేము వెళ్ళిపోతూ హాల్‌వైపు చూశాం. బుకింగ్ దగ్గరున్న క్యూలలో ఒకదానిలో ముసలాయన! మేము సినిమా మానుకుని ఆయనకి సినిమా చూపించామన్నమాట! అర్థమైందా?"

నాకు ఆశ్చర్యం వేసింది.

అంత అమాయకంగా కనిపించే ఆ ముసలాయన అంతగా నటించగలడా?

కాఫీ పూర్తిచేసి థియేటర్ చేరుకున్నాం.

థియేటర్ బయట ఆ సినిమా హీరోగారి అభిమానుల కోలాహలం పెరిగిపోయింది. ఆ సినిమాలో హీరో నటనకి ఆ రోజే ఉత్తమ నటుడి అవార్డు వచ్చిందిట.

కుంటివాడుగాను, గుడ్డివాడుగాను, ధనవంతుడుగాను....రకరకాల వేషాల్లో పెద్ద కటౌట్లు హాలుముందు వేళ్ళాడుతున్నాయి. వాటన్నింటినీ దండలతో కప్పేశారు అభిమానులు

ఆ థియేటర్ ముందు ఎవరినోట విన్నా ఆ హీరోగారి నటనా వైభవం గురించే!

సినిమా మొదలైంది.

రకరకాల వేషాల్లో హీరో ప్రేక్షకుల కంట నీరు పెట్టించాడు. ఆయన అన్ని వేషాలు మార్చినా ఎవ్వరూ గుర్తుపట్టరు. తన ప్రతిభతో దుర్మార్గుల ఆట కట్టిస్తాడు ఆఖరికి. ఆయన ఉత్తమ నటుడి అవార్డుకి అర్హుడు అనిపించింది.

మా వారికి కూడా ఆయన నటనెంతో నచ్చింది. థియేటర్ బయటికి వచ్చిన తర్వాత కూడా హీరోగారి నటనని పొగుడుతూనే వున్నారు.

రోడ్డుమీదకివచ్చి నిలబడ్డాం.

"బాబూ!"

వెనక్కి తిరిగాం.

చేతిలో కర్రతో ముసలాయన- ఓ కంటికి కట్టు కట్టి వుంది!

"ఆపరేషన్ అయింది బాబూ! .... ఈ మందులు కావాలి...." చేతిలోని చీటిని ముందుకు చాపాడు.

నాకు వెంటనే మా నాన్నగారు గుర్తుకొచ్చారు. ఆయనకి శుక్లాల ఆపరేషన్ చేయించాలి.

"సరిపోయింది.... మళ్ళీ ఈ వేషంలో ప్రత్యక్షమయ్యావా?" శ్రీవారి గొంతులో కోపం తొణికిసలాడింది.

మరోసారి పరిశీలనగా ఆ ముసలాయనవంక చూశాను.

''నువ్వు గుర్తుపట్టలేదా? ఇందాక హోటల్ దగ్గర ఆకలంటూ అఘోరించిన ముసలాయనే- ఇప్పుడే అపరేషన్ అయిన అవతారంలో...."

మావారి మాట పూర్తికాకముందే ఆ ముసలాయన అక్కడనుండి ముందుకి కదిలాడు.

ఆ సినిమాలో హీరోగారు అన్ని వేషాలు మార్చినా ఎవ్వరూ గుర్తుపట్టలేదు- అఖరికి భార్య కూడా! ఈ ముసలాయన మారువేషాన్ని ఒక్కసారి చూసినవాళ్ళే పట్టేస్తున్నారు! ఆయన నటనకి వేలకివేలు డబ్బుతో పాటు అవార్డులు కూడా ఇచ్చినవారు ఈయన నటనకి పైసా ఇవ్వకపోగా అసహ్యించుకుంటున్నారు. ఎక్కడుంది తేడా? అర్థం కాలేదు నాకు.

"ఏమండీ.... నాకోరూపాయి ఇవ్వరూ?" అడిగాను.

జేబులోంచి రూపాయితీసి ఇచ్చారు.

దాన్ని తీసుకుని గబగబా ముసలాయనవేపు కదిలాను.

నన్ను చూస్తూనే ఆయన అక్కడినుంచి వెళ్ళిపోబోయాడు.

"ఆగండి...." దగ్గరికి వెళ్ళి రూపాయి ఆయన చేతిలో కుక్కి ఎంత వేగంగా వెళ్ళానో అంత వేగంగానూ వెనక్కి తిరిగాను.

ఆ ముసలాయనకి, మా వారికి, అక్కడున్న ఎవ్వరికీ నా ప్రవర్తన అర్థంకాలేదు. అయోమయంగా చూడసాగారు. *

(స్వాతి సపరివార పత్రిక 14-2-86)